# వృత్తి దాంపత్యాలు

జగదీశ్ ప్రసాద్ పాండే బి.ఏ. చదువుతోన్నప్పుడు,అయిదో క్లాసు చదువుకొన్న యశోదా ఝూని, పెళ్లి చేసుకొన్నాడు. ఆ తర్వాత ఎమ్.ఎ. చదివాడు. ఐ.ఎ.ఎస్. పాసయ్యాడు. గవర్నమెంట్ నౌకరీలో చేరి, అండర్ సెక్రటరీగా ప్రొమోషన్ వచ్చేసరికి, ఆరుగురు పిల్లల తండ్రి కూడా అయ్యాడు. తను విద్యావంతుడు కాబట్టి, అందరికీ చదువులు చెప్పించాడు. అయిదో క్లాసు చదువుకొన్న అమ్మ అంటే ఆ పిల్లలందరికీ చాలా జాలిగా ఉండేది.

పెద్ద పిల్ల సునీత ఏమ్.ఏ. లిటరేచర్ పాసయిన వెంటనే, పెళ్ళి సంబంధాలు చూడసాగాడు పాండే. తన హోదా, అంతస్తూ చూసి సంబంధాలు కాళ్ళ దగ్గరకి వచ్చి పడ్తాయనుకొన్నాడు. వాటిని చూసి, తల మాసిన వాళ్ళు కూడా చాలా కట్నాలడిగిన వాళ్ళు వచ్చారు కాని, నచ్చిన సంబంధం ఒక్కటీ రాలేదు. కొన్ని అమెరికాలో యింజనీర్ల సంబంధాలు చూసి, వివరాలు, జాతకం, ఫోటోతో సహా పంపాడు. మాకు యింజనీరింగ్ చదివి కంప్యూటర్లలో ప్రవేశమున్న వాళ్ళే కావాలని, ఫొటోని, జాతకాన్ని తిరిగి పంపేశారు. యిద్దరు యిండియాలో పన్జేస్తున్న యింజనీరు కుర్రాళ్ళు ముందుకు వచ్చారు కాని, వాళ్లు డొనేషన్ కట్టిన డబ్బుకి చక్రవడ్డీతో సహా కట్నం అడిగి, పాండేగారి పరపతితో పెద్ద కంపెనీల్లో పెద్ద ఉద్యోగాలు వేయించమన్నారు. కొత్తగా సర్వీసులో చేరిన ఓ కుర్ర కలెక్టర్ని కదిపి చూస్తే, అమ్మాయి క్వాలిఫికేషన్ ఐ.ఎ.ఎస్. అయ్యుండాలి, లేదా డాక్టరై యుండాలి అన్నాడు.

చివరికి సునీత వయసు చేసే తొందర భరించలేక, పాట్నా యూనివర్సిటీలో లెక్చరర్‌గా పనిచేసే కిరణ్ ద్వివేది అనే అతన్ని ప్రేమించింది. అతను సునీత చేత బి.యిడి. చదివించి, ఆ తర్వాత ఆమెని అర్ధాంగిగా చేసుకొన్నాడు.

పాండే రెండో కొడుకు వినీత్ ప్రసాద్ కూడా ఎమ్.ఏ. పాసయి, ఐ.ఎ.ఎస్. వయసు రేఖ దాటేలోపల రెండు సార్లు ప్రయత్నించి విఫలుడై, 'లా' పాసై, ప్రాక్టీసు పెట్టాడు. నాలుగైదు సంబంధాలు చూసిన వినీత్ ప్రసాద్ పాండే ఖంగుతిన్నాడు. 'అందం అంతంత మాత్రం. కనీసం యింజనీరో, డాక్టరో అయ్యుంటే బావుండేది!' అని ఆ యువతులు పెదవి విరిచారు. చివరికి వినీత్, అదే కోర్టులో ప్రాక్టీసు చేస్తూ తన కంటే ఒక ఏడాది ఎక్కువ వయస్సున్న యామినీ యాదవ్‌ని పెళ్ళి చేసుకొన్నాడు. కులం వేరంటూ తల్లి యశోదా పాండే కాస్త గొడవ చేసినా, 'మారిన కాలం పద్ధతి చూస్తే మగపిల్లవాడికృూడా పెళ్ళవడం కష్ట'మని గ్రహించి, కిమ్మనకుండా ఊరుకొంది.

మూడో సంతానం, కూతురు కళ్యాణి. పాట్నా మెడికల్ కాలేజీలో ఎమ్.బి.బి.ఎస్. చదివి, ఆ తర్వాత ఢిల్లీ ఆలిండియా మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరి ఎమ్.డి. గైనకాలజీ చేసింది. పురుళ్ళు పోసే డిప్లొమా సంపాదించింది. పాండే దంపతులు పెళ్ళి సంబంధాల కోసం చూడసాగారు. మొదట్లో పెద్ద పిల్ల సంబంధాలు చూస్తున్నప్పుడు ఐ.ఎ.ఎస్. పిల్ల కావాలన్న ఆ కుర్ర కలెక్టర్ కళ్యాణిని చేసుకోవడానికి ముందుకు వస్తే, అభిమానం చంపుకొని పాండే దంపతులు కాస్త సుముఖత చూపించినా, కాదు పొమ్మంది కళ్యాణి.

అదే సమయంలో ఇతర వైద్య విషయాల్లో ఎం.డీ. లూ, ఎమ్.ఎస్.లూ చేస్తున్న అనేక మంది కుర్రాళ్ళు కళ్యాణి వెనుక పడ్డారు. టాక్సీల్లో అయిదు నక్షత్రాల హోటళ్ళకి తీసుకువెళ్ళి కాండిల్ లైట్ డిన్నర్లిప్పించారు. పుట్టిన రోజులకి బహుమతులిచ్చారు. చివరికి మహారాష్ట్రకి చెందిన 'మాధవ్ ఖండారె' ఎమ్.ఎస్., అంతిమ విజయం సాధించి, జగదీశ్ ప్రసాద్ పాండే అల్లుడయి కూర్చున్నాడు. ఆ వైద్య దంపతులిద్దరూ, కొల్హాపూర్ తిలక్ వీధిలో 'కళ్యాణి నర్సింగ్ హోం' స్థాపించి, ప్రాక్టీసు మొదలుపెట్టారు.

మాధవ్ ఖండారె ప్రాక్టీసు అంతంతమాత్రంగానే ఉన్నా, నర్సింగ్‌హోం కళ్యాణి చేతుల్లో మూడు పువ్వులూ ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది.

దేశంలో రోగాలకి కొరత ఏర్పడవచ్చునేమో గాని, జనాలకి కాదు. అందుకనే అంతంత మాత్రంగా చెప్పుకొనే పట్టణాల్లో కూడా, వీధికో నర్సింగ్ హోం వెలుస్తోంది. అందులో విధాయకంగా ఉండేది ఓ లేడి డాక్టర్. ఓ మెటర్నిటీ వార్డు.

**ఉపశృతి :**

"ఏమిటో విలువలు పడిపోయాయి. సినిమాలు శృంగార రస భరితాలు. టీవీ ఛానల్స్ శృంగార రసభరితాలు. ఇప్పుడు పత్రికల్లో కూడా, పేజి పేజికి శృంగారాన్ని జొప్పిస్తున్నారు. సెక్సుని గురించి చెప్పేస్తున్నారు" – ఓ పెద్ద మనిషి వాపోయాడు.

"రోగాన్ని వైద్యం అరికడుతుంది. హద్దు మీరిన శృంగారంతో అడ్డులేని సెక్సు జనాన్ని పెంచి, జనాభా రోగాన్ని పెంచుతుంది. జనాభా రోగాన్ని అరికట్టాలంటే మాధవ్ ఖండారె లాంటి సర్జన్ల ప్రాక్టీసు పెంచి, కళ్యాణి లాంటి డాక్టర్ల ప్రాక్టీసు తగ్గించాలి!" అన్నాడు మరో మనిషి.

"అన్యాయం, ఇది స్త్రీ వాద విరుద్ధం!" అంది కళ్యాణి లాంటి డాక్టరు.

"మీరు డాక్టరుగా కాక, స్త్రీగా ఆలోచించండి. జన్మనిచ్చేది స్త్రీయే కనక, తక్కువ సంతానం స్త్రీ వాదాన్ని సమర్థిస్తుంది. నిజానికి అది దేశ వాదం!" అన్నాడు రెండో మనిషి.